సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 5 । మే । 2024



చేరికల వరస

ఆమదాలవలస వైఎస్సార్‌ సీపీలో జోరుగా చేరికలు జరుగుతున్నాయి. పార్టీలో జోష్‌ పెంచుతున్నాయి.

- 8లో



ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లిలో ఆదిత్యుని కల్యాణం ఘనంగా జరిగింది. శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించారు.

- 8లో

డిగ్రీ సప్లిమెంటరీ తేదీల్లో మార్పు

ఎచ్చెర్ల క్యాంపస్‌: డిగ్రీ రెండు, నాలుగు సప్లిమెంటరీ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు ఎగ్జామినేషన్స్‌ డీన్‌ డాక్టర్‌ ఎస్‌.ఉదయ్‌భాస్కర్‌ శనివారం ప్రకటనలో తెలిపారు. 6, 7 తేదీల్లో జరగాల్సిన రెండో సెమిస్టర్‌ పరీక్షలు 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. డిగ్రీ నాలుగో సెమిస్టర్‌ పరీక్షలు 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఐసెట్‌ పరీక్ష ఉన్నందున మార్పు కోరారని, వారి విన్నపం మేరకు మార్పులు చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్‌

‘బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు తప్పవు’



ఈఎస్‌ సుబ్బారావు

శ్రీకాకుళం క్రైమ్‌ : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గానీ, ఇతర రాష్ట్రాల మద్యాన్ని గానీ గ్రామాలు, వార్డుల్లోకి తీసుకువెళ్లి బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు తప్పవని జిల్లా ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ (ఈఎస్‌) బి.సుబ్బారావు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరా కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా శుక్రవారం జిల్లాలో ఆరు కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేశామని, రూ. 10 వేల విలువ గల 15 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఈఎస్‌ సుబ్బారావు అన్నారు. అరెస్టయిన ఆరుగురూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి వాటిని బెల్టుషాపుల్లో నిల్వ చేసి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఈ దాడులు నిర్వహించామన్నారు. బెల్టుషాపులు నిర్వహించేవారిపై ఎక్సైజ్‌, స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో విభాగాలు సంయుక్తంగా దాడులు చేసి కేసులు బుక్‌ చేసి రిమాండ్‌ విధించడమే కాక పెనాల్టీ విధిస్తామని తెలిపారు.

‘ప్రేరణ’లో విద్యార్థుల ప్రతిభ



లమ్మట అఖిల్‌సాయి



మైత్రిముంజి

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో గల జవహర్‌ నవోదయ విద్యాలయంలో ఏప్రిల్‌ 19న జరిగిన జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవం (డ్రాయింగ్‌, వ్యాస రచన) పోటీల్లో టెక్కలి జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థి లమ్మట అఖిల్‌ (9వ, తరగతి), శ్రీకాకుళానికి చెందిన మైత్రిముంజి (10వ తరగతి) అనే విద్యార్థులు తమ ప్రతిభను కనపరిచారు. వీరిద్దరూ ఫైనల్‌ ఇంటర్వ్యూలో ఎంపికయ్యారని జవహర్‌ నవోదయ ప్రిన్సిపాల్‌ డి.పరశురామయ్య, లక్ష్మీనారాయణలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి గుజరాత్‌లోని వాడ్నగర్‌లో ఏడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పోస్టల్‌ బ్యాలెట్‌ పోలింగ్‌ కేంద్రం పరిశీలన



ఈవీఎం ర్యాండమైజేషన్‌ పరిశీలిస్తున్న కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ సమూన్‌

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌లోని నాలుగు పోస్టల్‌ బ్యాలెట్‌ పోలింగ్‌ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ సమూన్‌ శనివారం పరిశీలించారు. పోలింగ్‌ పనితీరును ఆర్వో అప్పారావును అడిగి తెలుసుకున్నారు. పాతపట్నం నియోజకవర్గానికి సంబంధించి పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు మండలానికి ఒక్కో పోలింగ్‌ కేంద్రం, హిరమండలం, ఎల్‌.ఎన్‌ పేట మండలాలకు కలిపి ఒక పోలింగ్‌ కేంద్రం కేటాయించారు. మొదటి రోజు పీఓ, ఏపీఓలు పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. అలాగే మార్కెట్‌ యార్డు గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల ర్యాండమైజేషన్‌ ప్రక్రియను కూడా కలెక్టర్‌ పరిశీలించారు. పోలింగ్‌ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సీఐ నల్లి సాయి, తహసీల్దార్‌ ప్రసాదరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత చౌదరి బాబ్జీ ఆక్రమించిన కృష్ణబంద చెరువు (ఫైల్‌)



పచ్చ తమ్ముళ్లే అసలు భూచోళ్లు

వెబ్‌ల్యాండ్‌ ముసుగులో గతంలో మోసాలు

- ఎచ్చెర్ల పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఎస్‌ఎంపురం వెళ్లే దారిలో ఉన్న కృష్ణ బంద చెరువును టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ) ఆక్రమించారు. 2016లో ఈ చెరువుకు సంబంధించిన రికార్డులను మార్పు చేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టగా దాదాపు 3.11ఎకరాల భూమిని ఆక్రమించినట్టు అధికారులు గుర్తించారు. ఆక్రమిత భూమి అంతా పూర్తిగా చెరువు గర్భమని గుర్తించి, రికార్డుల నుంచి చౌదరి బాబ్జీ పేరు తొలగించారు.

- ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎం పురంలో సర్వే నంబరు 112లో కొండ ప్రాంతాన్ని సబ్‌ డివిజన్‌గా చేసినట్టుగా చూపిస్తూ 638లో 4.35 ఎకరాల మేర టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి (బాబ్జీ) అక్రమంగా పట్టా సంపాదించారు. తన తండ్రి చౌదరి సత్యనారాయణ స్వాతంత్య్ర సమరయోధుడిగా కొనసాగారని, దానిలో భాగంగా తన తల్లి సరస్వతమ్మ పేరున 1999లో ప్రభుత్వ భూమి ఇచ్చారని, అది వారసుడిగా తనకు వచ్చిందని 2018లో వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించారు. వాస్తవంగా స్వాతంత్య్ర సమరయోధుడిగా వేరే చోట భూములు పొంది విక్రయించారు. కానీ ఈ కొండలో తమకు పట్టాలిచ్చినట్టుగా ఫేక్‌పత్రాలు సృష్టించారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ జరిపారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పచ్చ భూచోళ్ల అక్రమాల్లో పైవి కొన్ని మాత్రమే. టీడీపీ హయాంలో జరిగిన భూ ఘోరాలెన్నో. వెబ్‌ల్యాండ్‌లో రికార్డులు మార్చేసి ప్రభుత్వ భూముల్ని, ప్రైవేటు వ్యక్తుల్ని తమ పేర్లపై రాసుకుని దర్జాగా అనుభవించడం, వాటిపై బ్యాంకుల్లో పెట్టి రుణాలు కాజేయడం వంటివి ఎన్నో చేశారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్నట్టుగా సాగిపోయారు. దీనికంతటికీ చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన వెబ్‌ల్యాండ్‌ విధానమే కారణం.

చంద్రబాబు హయాంలో వెబ్‌ల్యాండ్‌లో ఎన్నో అక్రమాలు జరిగాయి. జిల్లాలో 5.66లక్షల రైతులుండగా వారిలో 40శాతం మేర రైతుల భూముల రికార్డులు తప్పుల తడకగా ఉండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని గ్రామాల్లో ఉన్న భూమి కంటే ఎక్కువగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయగా, కొన్ని గ్రామాల్లో ఉన్న భూమి కంటే తక్కువ నమోదు చేశారు. ఒకరి సర్వే నంబర్లు మరొకరి పేరున, ఉన్న భూముల కన్న ఎక్కువగా, ఎక్కువ భూములున్న వారికి తక్కువ నమోదు చేయడం వంటి పరిస్థితులు చోటు చేసుకున్నాయి. భూమే లేని వారికి భూమి ఉన్నట్టు చూపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. వివాదాస్పద భూములను, అమాయక రైతుల భూములను టీడీపీ నేతలు తమ పేర్లతో నమోదు చేయించుకున్నారు. వారసత్వ భూములు వారసుల పేరిట నమోదు కాకపోవడంతో మ్యూటేషన్‌కు దరఖాస్తులు చేసుకున్నా వెంటనే పని జరగని సందర్భాలు ఉన్నాయి. మాన్యువల్‌ అడంగళ్‌ నుంచి కంప్యూటరైజ్డ్‌ వెబ్‌ల్యాండ్‌ లో నమోదు చేసినప్పుడు చాలా ఖాతాలు (వన్‌బీ)లు నమోదు కాలేదు. దీన్ని సరిచేయడానికి ముప్పతిప్పలు పడ్డారు. రిజిస్ట్రేషన్‌లు, క్రయ విక్రయాలు జరిగిన తరువాత భూములు కొనుగోలు చేసుకున్న వారి పేరిట రెవెన్యూ రికార్డుల్లో లేవు. దీన్ని గాడిలో పెట్టేందుకు నానా అవస్థలు పడ్డారు.

వెబ్‌ల్యాండ్‌.. గుర్తుందా ఈ పేరు ? చంద్రబాబు హయాంలో తీసుకువచ్చిన ఈ విధానం సామాన్యుల భూములకు భద్రత లేకుండా చేసింది. ఒకరి పేరున ఉన్న భూమిని మరొకరి పేరుతో నమోదు చేయడం, అక్రమంగా పట్టాలు చేయించడం, పేదల భూమిని ఎక్కడో ఉండి అమ్మేయడం వంటి అక్రమాలెన్నో జరిగాయి. ఇలాంటి పచ్చ ‘భూ’చోళ్ల బారి నుంచి భూములను రక్షించడానికి వైఎస్‌ జగన్‌ సర్కారు సంస్కరణలను ప్రవేశ పెట్టింది.



- చంద్రబాబు హయాంలో వెబ్‌ల్యాండ్‌లో అక్రమాలు
- రైతులను నిండా ముంచేసిన గత టీడీపీ ప్రభుత్వం
- ఒకరి భూమి మరొకరి పేరున నమోదు
- గత మోసాలకు అడ్డుకట్ట వేసి, చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్న వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం

అక్రమాలకు చెక్‌

- గ్రామాల సరిహద్దు నుంచి భూముల వరకు ప్రతి అంగుళం విడిచిపెట్టకుండా సర్వే చేయడం వల్ల ఎన్నో వివాదాలకు చెక్‌ పడింది.
- భూ సర్వేలో డ్రోన్‌ల సాయంతో ఫొటోలు తీయడం మొదలుకొని, మ్యాపింగ్‌ వరకూ అన్ని వివరాలూ ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి.
- రికార్డులు చెరిపేయడానికి, టాంపరింగ్‌ చేయడానికి ఆస్కారం లేని విధంగా సర్వే కొనసాగుతోంది.
- రీ సర్వే పూర్తయిన తర్వాత రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ చేసింది. దీని వల్ల అక్రమాలకు అవకాశం లేకుండా పోయింది.
- రైతుల పేరున పక్కాగా రికార్డులు ఉండేలా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం చేసింది.
- వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్స్‌, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భూములు సహా సమగ్ర సమాచార సేకరణ, నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు, వివాదాల్లేని భూ యాజమాన్య హక్కులు నిర్ధారణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- యాజమాన్య హక్కులు ధ్రువీకరించేందుకు ఆధునిక టెక్నాలజీ సాయంతో ఇతరులు రికార్డులను తారుమారు చేసే అవకాశం లేని రీతిలో అడుగులు వేసింది.
- అంతేకాకుండా గ్రామ స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా సచివాలయం రిజిస్ట్రేషన్‌ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

- కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరుడు మదన్‌గౌడ్‌ నందిగాం మండలం మాదిగా పురం పరిధిలో గురుబెల్లి చిన్నిమ్ములు, తలగాపు సత్యవతిల పేరున సుమారు 14 ఎకరాలను, సొంటినూరు పరధిలో గురుబెల్లి చిన్నమ్మలు పేరున 15 ఎకరాలు, తలగాన సత్యవతి పేరున 15 ఎకరాలు, కల్లేపల్లి త్రినాథరావు పేరున 15 ఎకరాలకు రెవెన్యూ రికార్డులను తయారు చేయించి వారి పేరున 1బీలు, అడంగల్‌ కాపీలు తయారు చేశారు. వీటిని హైదరాబాద్‌కు చెందిన నల్లబొంతుల కరుణాకర్‌కు అమ్మకం పెట్టేశారు. అదంతా తప్పుడు డాక్యుమెంట్లు అని తెలుసుకుని కరుణాకర్‌ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి మదన్‌గౌడ్‌ను అరెస్టు చేశారు. ఇప్పుడిది కోర్టులో ఉంది.

- అచ్చెన్నాయుడు మరో అనుచరుడు, మెళియాపుట్టి మండలానికి చెందిన టీడీపీ నేత హనుమంతు చంద్రశేఖర్‌ కరజాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 373–41, 373–42, 373–43లో ఉన్న 3.62 ఎకరాల ప్రభుత్వ భూమిని తన భార్య హనుమంతు హేమలత పేరు తో పట్టా చేయించుకున్నారు. అంచెలంచెలుగా రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేయించుకుని కంప్యూటర్‌ అడంగల్‌ పొందాడు. వాస్తవానికి ప్రభుత్వ భూమి పొందితే డీ పట్టా అని రాయించాలి. కానీ అనువంశికం అని రికార్డుల్లో నోట్‌ చేయించి బ్యాంకు రుణాలు పొందాడు.

పచ్చ పాపాలు- 9



జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా మంచి కార్యక్రమానికి ప్రభుత్వం ముందడుగు వేసింది. గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న

చక్కదిద్దుతున్న వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం

భూమి వివాదాల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం అమల్లోకి తెచ్చింది. దేశంలో తొలిసారిగా అత్యంత శాస్త్రీయ పద్ధతిలో సమగ్ర భూసర్వే ప్రారంభించింది. తొలి విడత 354 గ్రామాల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పూర్తి చేయగా, రెండో విడత 195 గ్రామాల లక్ష్యంతో రీసర్వే చేసింది.

ప్రచార పర్వం

ఉద్వేగభరితంగా..

ఎన్నికల ప్రచారాలు ఉద్వేగభరిత దృశ్యాలకు వేదికలవుతున్నాయి. హారతులు, ఆశీర్వాదాలు, ర్యాలీలతో ఊళ్లన్నీ హోరెత్తుతున్నాయి.



సంతబొమ్మాళి: టెక్కలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌ ప్రజలకు దగ్గరయ్యేలా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బృందావనంలో ఓ పింఛన్‌ లబ్ధిదారు కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు.



స్పీకర్‌ తమ్మినేని సీతారాం ప్రచారంలో దూసుకుపోతున్నారు. కొత్తవలస గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆడ పడుచులు హారతులిచ్చారు. – ఆమదాలవలస రూరల్‌



మంత్రి ధర్మాన ప్రసాదరావు జోరు చూపిస్తున్నారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలో ప్రచారం నిర్వహించి ఉత్తేజపరిచారు. – పీఎన్‌కాలనీ, శ్రీకాకుళం



ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ పల్లెలన్నీ చుట్టేస్తున్నారు. సోంపేట మండల పరిధిలో తోటల గుండా ఇలా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. –సోంపేట



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నారు. పైడిభీమవరంలో ప్రచారం చేస్తూ ఓ మహిళకు గమేళాతో మట్టి ఎత్తారు. – రణస్థలం



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ ప్రచారంలో జోరు పెంచారు. కరవంజలో ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. – జలుమూరు



ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ జెండాను రెపరెపలాడిస్తున్నారు. పాతపట్నంలో బైక్‌ ర్యాలీతో ప్రజలను పలకరిస్తున్నారు. – పాతపట్నం



మంత్రి డాక్టర్‌ అప్పలరాజు జనాలకు చేరవవుతున్నారు. మందస మండలంలో ఓ అవ్వ మంత్రిని ఆప్యాయంగా ముద్దాడారు. – మందస

పోస్టల్‌ బ్యాలెట్‌ ప్రారంభం



శ్రీకాకుళంలో పోలింగ్‌ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ సమూన్‌



పాతపట్నం: పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం క్యూలో ఉన్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌:

జిల్లాలో శనివారం నుంచి పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ప్రారంభమైంది. షెడ్యూల్‌ ప్రకారం ఈ నెల 7వ తేదీ వరకు ఉండగా, తొలిరోజు ఎన్నికల విధుల్లో ఉన్న పోలింగ్‌ ఆఫీసర్లు, అసిస్టెంట్‌ పోలింగ్‌ అధికారులు తదితరులు బ్యాలెట్‌ ఓట్లు వేశారు. పోలింగ్‌ విధుల్లో ఉన్న ఉద్యోగులు జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోనూ, ఆయా నిర్దేశిత కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోస్టల్‌ బ్యాలెట్‌ కేంద్రాలను శనివారం కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్‌ జిలానీ సమూన్‌, జేసీ ఎం.నవీన్‌, ఇతర అధికారులు, రిటర్నింగ్‌ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 7004 మంది పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు వేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 643, పలాసలో 756, టెక్కలిలో 862, పాతపట్నంలో 760, శ్రీకాకుళంలో 1582, ఆమదాలవలసలో 988, ఎచ్చెర్లలో 630, నరసన్నపేటలో 783 ఓట్లు పడ్డాయి.

క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం చైత్ర బహుళ ఏకాదశి (మతత్రయ ఏకాదశి) సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమూర్తులుగా అనివేటి మండపంలో కొలువుదీర్చారు. అనంతరం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణం జరిపించారు. కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీసు కుటుంబాలకు చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్ : అనారోగ్య సమస్యతో మరణించిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.బెన్నయ్య, కేశవరావుల కుటుంబ సభ్యులకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.ప్రేమ్‌కాజల్ శనివారం సాయం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులో రాష్ట్ర పోలీసు కార్యాలయం ప్రధాన శాఖాపరంగా మంజూరు చేసిన కార్పస్‌ఫండ్ రూ. లక్ష చొప్పున అందించారు.

ప్రమాద బాధితులకు పరిహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న ఘటనలో బాధితులకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం న్యాయ సదన్‌లో మోటార్ యాక్సిడెంట్ స్కీం-2022పై నిర్దేశిత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న ఘటనలో మృతులకు, క్షతగాత్రులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో దిశా పోలీస్ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సీఎం జగన్ పాలన



వైఎస్ థామస్‌రెడ్డిని సన్మానిస్తున్న క్రైస్తవ నాయకులు

ఆమదాలవలస: కుల, మత, ప్రాంతాలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని క్రిస్టియన్ మైనార్టీ వ్యవహారాల రాష్ట్ర ఎలక్షన్ కో ఆర్డినేటర్ డాక్టర్ వై.ఎస్.థామస్ రెడ్డి అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. క్రైస్తవులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అందిన సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ జగన్‌ను సీఎం చేసేందుకు అందరూ కృషి చేయాలని, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ జి.శామ్యూల్ అరుణ్‌కుమార్, పాస్టర్ మధు, ప్రేమానందం, చంద్రన్న, అసిర్‌కుమార్, జార్జ్ ముల్లర్, నాగేశ్వరరావు, జాన్ పీటర్, శామ్యూల్ జాన్, జె.కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికాయల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ మండాపాలం కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వైపు మామిడికాయల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ డ్రైవర్ నిద్ర మత్తులో జారుకోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ బి.ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రైవేట్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి



రణస్థలం: గెద్దకంచరాం టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్యసభ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

- వైఎస్సార్ సీపీలోకి కొనసాగుతున్న చేరికలు

జలుమూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కానున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం కొమనాపల్లి పంచాయతీ కత్తిరివానిపేటకు చెందిన పొన్నాన రమణమూర్తి సోదరులతోపాటు పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కృష్ణదాస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ధర్మాన రామలింగంనాయుడు, ఎంపీపీ వాన గోపి, మండల పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, కరణం బాలకృష్ణ, గేదెల శిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

- రణస్థలం: జి.సిగడాం మండలం గెద్ద కంచరాం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు పుక్కల్ల అప్పన్న, లుట్ట విజయ్, మరో 10 కుటుంబాల వారు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి రాజ్యసభ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రావాడ పంచాయతీ ఉప్పివలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోర తవుడు, బొంతు కోటి, లొడగల రమణతో పాటు 10 కుటుంబాల వారికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రణస్థలంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నక్కా ప్రసాద్, గొర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- కొత్తూరు: మండలంలోని నేరడి, జోగిపాడు, ఉప్పరపేట గ్రామాలకు చెందిన 100 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో వై.తవిటినాయుడు, కె.గున్నయ్య, తాతయ్య, పి.రామకృష్ణ, రాజారావు, ఎం.రవణమ్మ తదితరులు ఉన్నారు. వీరికి పాతపట్నంలో క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రెడ్డి శాంతి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కొత్తూరు మండల పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, మెట్టూరు బిట్-2, గూనభద్ర అపోజిట్ ఆర్ఆర్ కాలనీ పంచాయతీల సర్పంచ్‌లు యర్లంకి ధర్మారావు, పెదకోట సాధబాబు, సీహెచ్ రవికిరణ్, బోర ఆఫీస్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- హిరమండలం: మండలంలోని పిండ్రువాడ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కరణం నాగయ్య, కె.ఢిల్లేశ్వరరావు, కుప్పురౌతు అశోక్‌కుమార్, బత్తుల తిరుపతిరావు, కె.ధనుంజయరావు, వి.ఈశ్వరరావు, కె.దాసు తదితర 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే రెడ్డిశాంతి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, నాయకులు వి.చిన్నారావు, జి.సుధీర్, ఎం.రామారావు, కె.ఆర్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.
- నందిగాం: మండలంలోని కొండలప్రాంతం హర్షబడ పంచాయతీ పెద్దగురువూరుకు చెందిన 20 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సుమారు 50 మందికి తిలక్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, పొందల లక్ష్మణరావు, పోలాకి మోహనరావు, చిన్ని జోగారావు, నందిగాం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



రణస్థలం: రావాడ పంచాయతీ టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



హిరమండలం: పార్టీలో చేరిన పిండ్రువాడ గ్రామస్తులతో ఎమ్మెల్యే రెడ్డిశాంతి



నందిగాం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



కొత్తూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వైఎస్సార్‌సీపీ వెంటే యాదవులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): యాదవ కులస్తులంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదవ సామాజికవర్గంలో కొందరు గతంలో టీడీపీ వెంట ఉండేవారని, వారిని ఓటు బ్యాంకుగానే వాడుకున్నారే తప్ప గుర్తింపు నివ్వలేదన్నారు. యాదవుల్ని గుర్తించింది దివంగత వైఎస్సార్, ఆ తరువాత తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. వైఎస్సార్ హయాంలో రెండుసార్లు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం జగనన్న ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, యాదవులు జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. జిల్లాలో 2.50లక్షల మంది యాదవులకు ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపించింది మంత్రి ధర్మాన ప్రసాదరావు అని తెలిపారు. పేదవాడికి సంక్షేమ, అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు, ఎంపీ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులనే గెలపించేందుకు యాదవులంతా సహకరిస్తారని చెప్పారు. ఈ నెల 7న శ్రీకాకుళం నియోజకవర్గంలో యాదవులతో కలిసి మంత్రి ధర్మాన క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నామని, అందరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్, బూర పాపారావు, చీమల తారకేష్, బాగు దశరథయాదవ్, చంగల శ్యామ్, నక్క దేవానంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సంజీవరావు

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు పక్కన ఓ వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉండటం స్థానికులు గుర్తించారు. వివరాలు ఆరా తీయగా మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామానికి చెందిన సవర సంజీవరావుగా గుర్తించారు. వెంటనే 108 అంబులెన్సులో టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్ల గానీ, అదుపుతప్పి పడిపోవడం వల్ల గానీ గాయపడి ఉండవచ్చని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. కుడి కాలు విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



దున్న లక్ష్మీనారాయణ(ఫైల్)

సోంపేట: మండలంలోని పాలవలస రైల్వేగేటు సమీపంలో శనివారం రైలు ఢీకొని పాలవలసకు చెందిన దున్న లక్ష్మీనారాయణ (62) మృతి చెందాడు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో గూడ్స్ ట్రెస్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. లక్ష్మీనారాయణకు భార్య శేషమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె జ్ఞానేశ్వరికి వివాహం కాగా, కుమారుడు కిషోర్‌కుమార్ వలస కార్మికుడిగా వేరే రాష్ట్రంలో ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడిచేసి.. ఆస్పత్రిలో చేర్పించి..!

జలుమూరు : మండలంలోని కొమనాపల్లి పంచాయతీకి చెందిన గొల్లంగి నవీన్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బైరి సింహాచలం శనివారం వేకువజామున కత్తితో దాడిచేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లంగి నవీన్‌కుమార్ వద్ద బైరి సింహాచలం ఆరు నెలల కిందట రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలంటూ మూడు నెలలుగా నవీన్ అడుగుతున్నా సింహాచలం స్పందించడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో సింహాచలం నవీన్‌కు ఫోన్ చేసి అప్పు తీర్చేస్తానని ఇంటికి రమ్మని పిలిచాడు. ఉదయం వస్తానని చెప్పి నవీన్ ఫోన్ కట్‌చేశాడు. మళ్లీ సింహాచలం శనివారం వేకువజామున నాలుగున్నర గంటలు సమయంలో నవీన్‌కు ఫోన్‌చేసి డబ్బులు తీసుకునేందుకు కొమనాపల్లి-అచ్యుతాపురం వాటర్ ట్యాంక్ వద్దకు రమ్మని పిలిచాడు. నిజమే అనుకొని నవీన్ వెళ్లగా సింహాచలం తన ద్విచక్ర వాహనంలో దాచి ఉంచిన కత్తితో పొడిచాడు. దీంతో కిందపడి ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న నవీన్‌ను చూసి భయపడి నిందితుడు సింహాచలమే నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సింహాచలంపై ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగం అందరి బాధ్యత



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం అర్బన్ : ఓటుహక్కు మన అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో సాధారణ ఎన్నికలు- 2024 పేరిట రూపొందించిన బ్రోచర్, బోర్డులను తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన పౌరులంతా ఓటు వేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్వచ్ఛంద సంస్థలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్, నోడల్ ఆఫీసర్ కిరణ్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ లయన్ నటుకుల మోహన్, అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు వెళ్లిన మహిళ మృతి



మంగ(ఫైల్)

టెక్కలి రూరల్: దైవ దర్శనానికి వెళ్లిన టెక్కలి చెందిన టంకాల మంగ(42) అనే వివాహిత శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. ఈమె మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న నర్మదా నది పుష్కరాలకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ఆదివారం టెక్కలి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

ఆమదాలవలస.. చేరికల వరస



బూర్జ మండలం కాలపర్తిలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన కార్యకర్తలు

- టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి కార్యకర్తల చేరిక
- ఎన్నేళ్లు కష్టపడినా గుర్తింపు లేదంటూ నాయకుల ఆవేదన
- తమ్మినేని గెలుపే ధ్యేయంగా విస్తృత ప్రచారం

ఆమదాలవలస: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమదాలవలసలో అపూర్వ ఆదరణ లభిస్తోంది. విజన్ ఉన్న నాయకుడు, స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం నాయకత్వంలోనే పనిచేస్తామంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. దీంతో ఆమదాలవలస నియోజకవర్గంలో టీడీపీ రోజురోజుకూ ఖాళీ అవుతోంది. పార్టీలో ఎన్నాళ్లు ఉన్నా గుర్తింపు రావడం లేదంటూ విసిగిపోయి టీడీపీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. ఇప్పటికే వేలాది మంది కుటుంబాలతో సహా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరిపోయారు.



పొందూరు మండలం కింతలిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో స్పీకర్ తమ్మినేని

బుజ్జగిస్తున్నా..

నియోజవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ముమ్మరం కావడంతో తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. పలు గ్రామాలల్లో కీలక నేతలు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బుజ్జగిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో గ్రామాల్లోకి వెళ్లి నచ్చచెప్పి వస్తున్నా ఉదయాన్నే వైఎస్సార్‌సీపీ లోకి చేరుతుండడంతో కూన గెలుపుపై ఆశలు వదులుకుంటున్నట్లు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

పార్టీని వీడిన కీలక నేతలు..

- ఆమదాలవలస మున్సిపాలిటీ రెండో వార్డు కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సనపల రాజుతోపాటు సుమారు 25 కుటుంబాల వారు స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- ఆమదాలవలస మండలం చిట్టివలస గ్రామానికి చెందిన కూన నాగు టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తూ 15 ఏళ్లుగా కూన రవికుమార్ వెంటే ఉంటూ కార్యకలాపాలు చూసేవారు. ఇటీవలే స్పీకర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- సరుబుజ్జిలి మండలం మతలబుపేటలో టీడీపీకి చెందిన గురుగుబెల్లి రాంబాబు, జి.గోవిందరావు, పైల రాజు, సనపల రాజు, పొందూరు రమణతో పాటు మరో 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఇదే మండలం బొప్పడాం గ్రామానికి చెందిన దానేటి కనవయ్య, దానేటి రామారావులతోపాటు మరో 15 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీ కండువాలు వేసుకున్నారు.
- పెదవెంకటాపురంలో మచ్చ రాంబాబు, జగదీశ్వరరావు, గణేశ్వరరావు, ప్రతాప్, రోహిత్, రాములతో పాటు మరో 20 కుటుంబాల కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.
- బూర్జ మండలం కాలపర్తి, లాభాం, అయ్యవారిపేటలో ఇప్పిలి తిరుపతిరావు, పీరుకట్ల సూరిబాబు, గేదెల చిన్నమ్మి, గేదెల కిషోర్, మామిడి మణికంఠ, చింతనిప్పుల దుర్గారావు, మామిడి మహేష్, కె.రవి, మామిడి రాజ్‌కుమార్, ఎం.సురేష్‌లతోపాటు సుమారు 65 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి స్పీకర్ తమ్మినేని సీతారాం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.
- పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన పైడి శ్రీనివాసరావు, పైడి ముఖలింగంతో పాటు 20 కుటుంబాలు, ఖాజీపేట గ్రామానికి చెందిన పల్ల గున్నయ్య, పల్ల తులసయ్య, కార్యకర్తలు స్పీకర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



సరుబుజ్జిలి మండలం మతలబుపేటలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతూ..



ఆమదాలవలస మండలం చిట్టివలసలో పార్టీలోకి కూన నాగును ఆహ్వానిస్తున్న స్పీకర్ తమ్మినేని

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నిమ్మాడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్

కోటబొమ్మాళి: నిమ్మాడ, వాండ్రాడ, చిట్టివలస, తులసిపేట పోలింగ్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ శనివారం పరిశీలించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలపై టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ మహ్మద్ అలీకు పలు సూచనలు చేశారు.

బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ ప్రారంభం



కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్నికల కోడ్ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఈ ఏడాది నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో క్రీడాకారులు నిరుత్సాహపడకూడదని క్రీడాసంఘాలు ముందుకువస్తున్నాయి. శనివారం బాక్సింగ్ క్రీడాంశంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మొదలయ్యాయి. శ్రీకాకుళం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అనుబంధ బలదేవ్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం ప్రారంభమైంది. క్లబ్ అధ్యక్షులు జి.ఇందిరాప్రసాద్, బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, శ్రీరామ్, జోగినాయుడు, లక్ష్మి, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులకు ఉడికించిన గుడ్లు, గ్లూకోజ్ ప్యాకెట్లను బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు పంపిణీ చేశారు.

50 అక్రమ మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



అల్లాడలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సీఐ గాయత్రి, సిబ్బంది

కోటబొమ్మాళి: జలుమూరు మండలం అల్లాడ గ్రామానికి చెందిన గురుకు రామారావు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా.. కోటబొమ్మాళి ఎస్ఈబీ సీఐ గాయత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి 50 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రామారావును అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ గాయత్రి తెలిపారు.

వసుంధర చెక్‌పోస్టు పరిశీలన



వసుంధర చెక్‌పోస్టును పరిశీలిస్తున్న పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ దిగంబర్ ప్రధాన్

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును శనివారం పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ దిగంబర్ ప్రధాన్ తనిఖీ చేశారు. ఎన్నికల సమీపిస్తున్నందును మరింత నిశితంగా తనిఖీలు చేయాలన్నారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో మరింత నిఘా పెంచాలని సూచించారు. నిషేధిత వస్తువులతో పాటు పలు రకాల వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా పర్యవేక్షించాలన్నారు.

బ్యాంక్ చుట్టూ ప్రదక్షిణలు



పూండి ఎస్‌బీఐలో పింఛన్ డబ్బుల కోసం వేచి చూస్తున్న వృద్ధులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ప్రధాన బ్యాంకుల చుట్టూ సామాజిక భద్రతా పింఛన్‌దారులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. చంద్రబాబు వల్లే ఈ పాట్లు వచ్చాయని, పింఛన్ డబ్బులు చేతికి రాకపోవడంతో సకాలంలో మందులు కొనుగోలు చేయలేకపోతున్నామని చాలా మంది చెప్పారు. ఉదయం 8 గంటలకే బ్యాంక్ వద్ద క్యూలో ఉండి సాయంత్రం వరకూ తిండీ తిప్పలు లేక ఆకలితో అలమటించిపోతున్నారు. వలంటీర్లు ఉంటే ఈ అవస్థ ఉండేది కాదని చెబుతున్నారు. పూండి స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియాలో విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపం కారణంగా ఖాతాదారులు మరిన్ని అవస్థలు పడ్డారు. బ్యాంక్‌లో యూపీఎస్ వ్యవస్థ కుప్పకూలిపోవడం, సోలార్ విద్యుత్‌లో ఇబ్బందులు తలెత్తడంతో విద్యుత్ సౌకర్యం ఉన్నా బ్యాంక్ పనిచేయని దుస్థితి శుక్ర, శనివారాల్లో ఎదురైంది. దీంతో వృద్ధులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

ఇదో దుర్మార్గ ప్రచారం

- శ్రీకాకుళం జిల్లాలో సాంబశివుడు అనే వ్యక్తి రిజిస్ట్రార్ కార్యాలయానికే రాలేదని తేల్చిన రిజిస్ట్రేషన్ అధికారులు
- ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై 'ఈనాడు' కథనమే తప్పు అంటూ ప్రకటన
- కొత్తగా రిజిస్టర్లంటూ ఏమీ లేవని తేల్చేసిన అధికారులు
- కక్షిదారులకు అవగాహన కలిగేలా సూచనలిచ్చిన అధికారులు
- ఈ చట్టం అమలు చేయబోమని ముందే స్పష్టం చేసిన ప్రభుత్వం



మీ భూమి మీది కాదు

ఈనాడులో ప్రచురితమైన కథనం

సాక్షి ప్రతినిధి: శ్రీకాకుళం:

'ఈనాడు' ఏనాడో నిజాలను రాయడం మానేసిందని మరోసారి రుజువైంది. పూర్తి పచ్చపైత్యంతో మరోమారు రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు కథనాలు అచ్చేస్తూ.. తమ దుగ్ధను ప్రదర్శించింది. 'మీ భూమి మీది కాదు..' అంటూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు కథనాన్ని పెద్ద పెద్ద అక్షరాలతో మొదటి పేజీలో అచ్చేసి దుర్మార్గపు ప్రచారానికి దిగింది. రాష్ట్రంలో 'పసుపు' చొక్కాలే రాజ్యమేలాలని.. రామోజీ తనదైన పైత్యాన్ని ప్రదర్శించారు. జనాలకు చెందిన భూములను ప్రభుత్వాలు తీసేసుకుంటాయా..? అలా ఎందుకు తీసుకుంటాయి.. ? అలా తీసుకునే ఉద్దేశమే ఉండుంటే.. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రైవేటు జిరాయితీ భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసి 31 లక్షల మంది పేదలకు ఉచితంగా పట్టాలుగా పంపిణీ చేసుండేదా...? ఇవేవీ 'ఈనాడు'లో ప్రచురితం చేయరు. ఏం చేసినా మా చంద్రబాబే చేశారు.. సంపద సృష్టిస్తారంటూ వార్తలు రాసేస్తారు.

కొత్త రికార్డుల ప్రస్తావనే లేదు

ఈనాడులో వచ్చిన కథనంలో పేర్కొన్నట్లుగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థిరాస్తులకు సంబంధించి ఎలాంటి రికార్డు పుస్తకాలు, రిజిస్టర్లు ఏర్పాటు చేయలేదు. అసలు ఈ యాక్ట్ అమలుకే రాకపోతే ఈ కొత్త రికార్డులెలా వస్తాయో రామోజీకే తెలియాలి. ఈనాడులో కథనం రావడం.. దీన్నే చంద్రబాబు, పవన్ తదితర ప్రతిపక్ష నేతలు తమ ప్రసంగాల్లో ఇష్టానుసారంగా ప్రచారాస్త్రాలుగా వాడుకోవడం నిత్యకృత్యంగా రాష్ట్రంలో కనిపిస్తోంది. ఈ సందర్భంలో ఈ చట్టంపై వస్తున్న అవాస్తవాలపై ప్రజలకు అవగాహన కోసం పలు సూచనలను కూడా చేస్తున్నారు.

2007 నుంచి అమల్లో ఉన్న 22–ఎ చట్టం సంబంధించి నిషేధిత జాబితా మాత్రమే ఆన్‌లైన్‌లో, మాన్యువల్ రికార్డులుగానూ కార్యాలయాల్లో ఉన్నాయని అధికారులు అధికారికంగానే చెబుతున్నారు. ఎవరైనా కక్షిదారులు రిజిస్ట్రేషన్ కోసం ఆ కక్షిదారుడు పేరు మీద వ్యవసాయ భూమి అయితే 1బి, అడంగళ్, నివాస స్థలమైతే లింక్ డాక్యుమెంట్, పొజిషన్ సర్టిఫికేట్, వీఎల్‌టీ, అసెస్‌మెంట్ నంబర్ ఉంటే 22–ఎ జాబితాలో ఆ ఆస్తి లేకుంటే ఎటువంటి అడ్డంకులు లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లుగా వివరిస్తున్నారు. ఈ విధానం కాకుండా కొత్త రికార్డుల ఏర్పాటు, ఇందులో ఆస్తి వివరాలు లేకపోతే.. రిజిస్ట్రేషన్లు అవ్వవు అనే పరిస్థితులు ఏ మాత్రం లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కేంద్రం తెచ్చిన చట్టం ఇది

ల్యాండ్ టైట్లింగ్ చట్టం అనేది 1989 నుంచి కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసేలా అడుగులు వేస్తూ వస్తున్నాయి. అయితే ఎట్టకేలకు తాజాగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నీతి ఆయోగ్ ప్రతిపాదించేలా ఈ చట్టాన్ని ప్రతిపాదించి అన్ని రాష్ట్రాలపై ఒత్తిడి పెంచింది. అయితే ప్రతిపాదన అంశంపై అధ్యయనం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయబోమని ప్రకటించిందన్న వాస్తవాన్ని తెలిసి కూడా ఏ మాత్రం సిగ్గు లేకుండా తప్పుడు కథనాన్ని ప్రజలను తప్పుదోవ పట్టించేలా వార్తను ప్రచురించేసింది.

శ్రీకాకుళం సాంబశివుడు పేరుతో డ్రామా

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రాష్ట్రంలో అమలైపోయిందని ఈనాడు అవాస్తవాలను రాసేయడమే కాకుండా ఇందుకు సాక్ష్యంగా శ్రీకాకుళం జిల్లాలో సాంబశివుడు అనే వ్యక్తి పేరును సాక్ష్యంగా తన కథనంలో వాడుకుంది. సాంబశివుడనే వ్యక్తి, తన భార్యకు జబ్బు చేస్తే.. స్థిరాస్తిని అమ్ముకునేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే.. ఈ ఆస్తి వివరాలు ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో అతడి పేరుతో లేవని అధికారులు చెప్పినట్లుగా వార్తలో కీలకంగా ప్రస్తావించారు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కొత్త రిజిస్టర్లను ఏర్పాటు చేయలేదు సరికదా.. స్థానిక జిల్లాలో ఉన్న 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంబశివుడనే వ్యక్తి స్థిరాస్తి విక్రయానికి సంబంధించి ఇటీవల కాలంలో రాలేదని ఆ శాఖాధికారులే స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు 'ఈనాడు' ప్రతి కథనానికి ఒక్కో ప్రాంతం నుంచి ఎవరో ఒక పేరును వాడేసుకుని వారి అవాస్తవ కథనాన్ని రక్తి కట్టించేలా రాసేస్తున్నారు. సంబంధిత రిజిస్ట్రేషన్ల శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళానికి చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడ జిల్లాలోనే సాంబశివుడనే వ్యక్తి పేరును వాడుకుని రామోజీ తన కథనానికి డ్రామా డెకరేషన్ చేశారు.

'పలాసలో సీదిరిని గెలిపిద్దాం'



డాక్టర్ సీదిరి అప్పలరాజుకు మద్దతు తెలుపుతున్న మాజీ ఉద్యమకారులు

కాశీబుగ్గ: మాజీ మావోయిస్టు నాయకులు, మాజీ ఉద్యమకారులు మంత్రి సీదిరి అప్పలరాజును శనివారం పలాసలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేట్ వర్గాలకు తొత్తు అయిన చంద్రబాబు సహజంగానే బీజేపీ చెంతకు చేరారని వారు అన్నారు. కూటమి తరఫున స్థానికంగా పోటీ చేస్తున్న గౌతు శిరీషను ఓడించాలని, మత్స్యకార వర్గం నుంచి ఎదిగిన సీదిరిని గెలిపించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర అంతా దళిత, ఆదివాసీ, పీడిత ప్రజల వ్యతిరేకమేనని అన్నారు. కారంచేడు, చుండూరు లాంటి నరమేధాలకి సూత్రధారులు, పాత్రధారులు బాబు అనుచరులేనని తెలిపారు. ఆయన హయాంలో ఉమ్మడి ఏపీని ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాగా మార్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థని సర్వనాశనం చేశారని గుర్తు చేశారు.

ప్రభుత్వ బడులు, ఆస్పత్రులు గాలికి వదిలేసి నారాయణ విద్యాలయాలను ప్రోత్సహించారని తెలిపారు. కార్పొరేట్ల చేతిలో ఆంధ్రప్రదేశ్‌ని పెట్టడానికి అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపాడని ఆరోపించారు. పలాస నియోజకవర్గం నేటికీ వెనుకబడడానికి గౌతు కుటుంబ పాలనే కారణమని అన్నారు. జీడి రైతులు ఉద్యమిస్తే పోలీసుదాడులు, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు చేశారని టీడీపీని ఉద్దేశించి అన్నారు. దళారీ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వ పథకాలు డైరెక్ట్‌గా లబ్ధిదారులు ఖాతాలో వేసే విధానాన్ని ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌ను అభినందిస్తున్నామని తెలిపారు.

విశాఖ రాజధానిని స్వాగతిస్తున్నామని, మూలపేట పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న కిడ్నీ మహమ్మారిని తరిమేయడానికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్, తాగునీరు అందించడానికి చేసిన కృషితో డాక్టర్ సీదిరి అప్పలరాజు మన నియోజకవర్గ ప్రజల సమస్యలలో నిలిచిపోయారని అన్నారు. పలాస రాజకీయాల్లో పెత్తందారులకు స్థానం ఇవ్వకూడదనే లక్ష్యంతో తాము అప్పలరాజుకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం



పార్వతీ పరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని చైత్ర మాసం బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం సాయంత్రం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబువి అమలు కాని హామీలు



మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

రణస్థలం: చంద్రబాబు మేనిఫెస్టోలో వెల్లడించిన హామీలు అమలు కానివని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సార్వత్రిక ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. రానున్న వారం రోజులు అప్రమత్తంగా పని చేయాలని, సీఎం వైఎస్ జగన్ చేసిన సంక్షేమాభివృద్ధిని ప్రజలకు తెలియజెప్పాలని అన్నారు. చంద్రబాబు మోసాలను కూడా జనాలకు వివరించాలని సూచించారు. చంద్రబాబు పాలనలో పింఛన్‌దారులు పడిన కష్టం, జగనన్న పాలనలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సంక్షేమాల అందజేతను గుర్తు చేయాలని సూచించారు. ఈ ప్రచారంలో బూత్ ఏజెంట్లు తప్పక ఉండాలని, ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా చూడాలని అన్నారు. బీసీలు అధికంగా ఉన్న ప్రాంతంలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అదీ బీజేపీకి టికెట్ ఇవ్వడమంటే బీసీలను అణగదొక్కడమేనని విమర్శించారు.

వలస ఓటర్లపై దృష్టి

నియోజకవర్గంలో ఉన్న వలస ఓటర్లను రప్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈవీఎంలో 3వ నంబర్ వరసలోని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా ప్రచారం చేయాలని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులంతా మీకు అందించిన బ్యాలెట్ నమూనా పత్రాలు పట్టుకుని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ప్రతి గడపకు బూత్ ఏజెంట్లతో వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనలో జరిగిన మంచిని, చంద్రబాబు బూటకపు హామీలను వివరించాలని చెప్పారు. ఈ వారం రోజులు పక్కా ప్రణాళికతో కష్టపడి పనిచేస్తే అధిక మెజారిటీతో తప్పక గెలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గెలిచాక విశాఖే మన రాజధాని



ఇంటింటా ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రానున్న ఎన్నికల్లో గెలిచాక విశాఖలో రాజధాని ఏర్పాటు చేసి అక్కడే ప్రమాణ స్వీకారం చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో దేశల్లవీధి, నక్కవీధి, కంపోస్టుకాలనీ, దండివీధి, బాదుర్లపేట, మావూరువీధి, హరిజన వీధి, రాజీవ్‌కాలనీ, వాంబేకాలనీల్లో శనివారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మన ఓట్లు కొల్లగొట్టడానికి ఓ దొంగ మేనిఫెస్టో తయారు చేశాడని దుయ్యబట్టారు. బాబుకి ఇంతకుముందు ఇలాంటి పథకాలు గుర్తుకు రాలేదా అని సూటిగా ప్రశ్నించారు. 2019లో సీఎం ఈ పథకాలు ప్రవేశపెట్టినప్పుడు రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. ఇప్పుడు అవే పథకాలను ఎలా ప్రకటించారని నిలదీశారు. గతంలో చాలా సార్లు చంద్రబాబు మాటలు విని జనం మోసపోయారని, మళ్లీ అలా జరగకూడదని అన్నారు. ఆ మేనిఫెస్టోను బీజేపీ ముట్టుకోవడానికి కూడా ఇష్టపడలేదని, నీ కూటమికే నమ్మకం లేనప్పుడు ఆ హామీలకు ఏంటి గ్యారంటీ అని ప్రశ్నించారు. 2014లో ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళల రుణమాఫీ, రైతు రుణ మాఫీ చేస్తానని కుదువలో ఉన్న పొలం పత్రాలు, బంగారు ఆభరణాలు సైతం విడిపించేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేసిన సంగతి ప్రజలందరికీ గుర్తుందన్నారు. వైఎస్ జగన్ ఒక్కసారి మాట ఇస్తే నిలబెట్టుకుంటారనే విషయం రాష్ట్రమంతటికీ తెలుసని అన్నారు. రానున్నది మన ప్రభుత్వమేనని అన్నారు.

ప్రచార కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, రుప్ప శేషగిరిరావు, నక్క రామరాజు, కర్నేన హరి, సాధు వైకుంఠరావు, రంగాజి దేవ్, గుంటముక్కల పాపారావు, రావాడ జోగినాయుడు, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, పోలు మహంతి ఉమామహేశ్వరరావు, దాసరి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఖాకీల బాకీలన్నీ క్లియర్



- 95 శాతం మేర ఎస్ఎల్, టీఏల పెండింగ్ బకాయిలు క్లియర్ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 1520 మందికి పైగా పోలీసుల ఖాతాల్లో సొమ్ము జమ

శ్రీకాకుళం క్రైమ్ : ఖాకీ సోదరుల బాకీలను ప్రభుత్వం క్లియర్ చేసేసింది. పెండింగ్‌లో ఉన్న రెండు సరెండర్ లీవ్‌లు (ఎస్ఎల్‌లు), మూడు టీఏ(ప్రయాణ భత్యం)లు చెల్లించింది. అంతేకాక జీపీఎఫ్ (సాధారణ భవిష్యనిధి), ఏపీజీఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా పథకం) పెండింగ్‌లో ఉన్న లోన్ బిల్లుల సొమ్మును కూడా పోలీసుల ఖాతాలో జమ చేసింది. ఈ లెక్కన జిల్లాలో 1520 మందికి పైగా పోలీసులకు 95 శాతం మేర పెండింగ్ బకాయిల సొమ్ము ఇప్పటివరకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసు వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరెవరికి పద్దాయంటే..?

జిల్లాలో సివిల్ (లాఅండ్‌ఆర్డర్), ఏఆర్, మెరైన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో , స్పెషల్ బ్రాంచి పోలీసులకు వారి వారి సర్వీస్, హోదా, పేస్కేల్, అనుసరించి పెండింగ్‌లో ఉన్న 2023 జూన్, డిసెంబర్ మాసాల రెండు సరెండర్ లీవ్ లు, మూడు నెలల (2023 నవంబరు, డిసెంబరు, 2024 జనవరి) టీఏల బకాయి సొమ్ము ప్రభుత్వం ఇచ్చింది. ఒక్కో సరెండర్ లీవ్‌కు జూనియర్, సీనియర్ స్థాయిని బట్టి రూ. 20 వేల నుంచి రూ. 60 వేల వరకు పద్దాయి. అంటే రెండు ఎస్ఎల్‌లకు రూ. 40 వేల నుంచి రూ. 1.20 లక్షల వరకు అన్నమాట. పేస్కేలు అనుసరించి పెరగనూవచ్చు. డీఎస్పీ ఆపై ఉన్నతాధికారులకు సంవత్సరానికి ఒక్క సరెండర్ లీవ్ మాత్రమే ఉంటుంది. అలాగే ఒక్కో టీఏకు కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు రూ. 2100, ఎస్ఐ స్థాయి నుంచి డీఎస్పీ వరకు రూ. 4 వేల వరకు పద్దాయి. ఈ లెక్కన జిల్లాలో 120 మంది ఎస్ఐ, ఆర్ఎస్ఐలు, 27 మంది సీఐ లు, 15 మంది డీఎస్పీలు, ఇద్దరు ఏఎస్పీలు, ఎస్పీయే కాక పీసీలు, హెచ్‌సీలు, ఏఎస్ఐలు, ఇతర సిబ్బందితో కలిపి మొత్తం 1520 మంది వరకు వారి వారి ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమచేసింది.

వీరే కాక..

డిప్యుటేషన్ వింగ్‌లో ఉన్న ఏసీబీ, ఇంటెలిజెన్సు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగాల పోలీసులకు కూడా పండగ దినాలు, ఆదివారాల్లో పనిచేసిన వారికి పద్దాయి. ఏసీబీలో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ, నలుగురు హెచ్‌సీలు, ఆరుగురు పీసీలు, ఒక డీఎస్పీ ఉండగా.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్లో ఎస్పీ, డీఎస్పీ, ఎస్ఐలు, హెచ్‌సీలు ఇద్దరేసి, పీసీలు ఆరుగురున్నారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ విభాగానికి వస్తే 45 మంది పీసీలు, హెచ్‌సీలు, ఎస్ఐలు నలుగురు, సీఐలు ఇద్దరు, ఈఎస్ ఒకరున్నారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్‌ఇన్సూరెన్స్.. ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న పోలీసులకు ఇచ్చే లోన్.. అంటే ఉద్యోగి గరిష్ఠ ప్రీమియంను బేసిక్ పేలో 20 శాతం వరకు వారు దాచుకున్న అమౌంట్ నుంచి అందించే లోన్లు తాలూకా 2023 అక్టోబర్ వరకు పెట్టుకున్న బిల్లులు కూడా క్లియర్ చేశారు. అంతేకాకుండా పోలీసులు వాడుకునే మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా క్లియర్ అయ్యాయి. జీపీఎఫ్‌లోన్లు 2023 అక్టోబరు నెల వరకు పెట్టుకున్నవి జమ చేశారు.

ఓటెత్తేలా ప్రత్యేక ఏర్పాట్లు

- విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయాలు
- పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్ చైర్లు
- ఇప్పటికే వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్‌కు అవకాశం



సిద్ధం చేసిన వీల్‌చైర్లు(ఫైల్)

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో విభిన్న ప్రతిభావంతులు సులభంగా ఓటు వేసేలా ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. దివ్యాంగులందరూ కూడా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ స్టేషన్లను దివ్యాంగుల ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతోంది. వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు, ఎన్నికల సంఘం గుర్తించిన వ్యాధిగ్రస్తులు సులభంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లను చేస్తోంది. వారు పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేసి తిరిగి ఇంటికి వెళ్లే వరకు అధికారులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 21,481 మంది దివ్యాంగులు ఓటర్లుగా నమోదయ్యారు. వీరంతా ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో తప్పక ఓటేసేలా ఎన్నికల అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు..

హోమ్ ఓటింగ్ అవకాశం

పోలింగ్ బూత్ వరకూ వచ్చి ఓటు వేసే అవకాశం లేని 85 ఏళ్లు పైబడిన వయో వృద్ధులు, 40 శాతం వికలాంగత్వం దాటిన విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కూడా ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, 85 ఏళ్లు పైబడిన వారు కలిపి 495 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు ఇంటి నుంచే ఓటు వేయనున్నారు.

సాక్షం యాప్‌తో సాయం

దివ్యాంగుల సాయం కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సాక్షం యాప్ రూపొందించింది. ఓటరుగా నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోడం, వీల్ చైర్, రవాణా సదుపాయాన్ని కోసం అభ్యర్థన, అంధులకు వాయిస్ ద్వారా సహకరించడం, వినికిడి లోపం ఉన్నవారికి టెక్స్ట్ టు స్పీచ్ థెరపీ తదితర సహాయ సహకారాలను ఈ యాప్ ద్వారా విభిన్న ప్రతిభావంతులు పొందవచ్చు.

జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దివ్యాంగ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
ఇచ్ఛాపురం	2775
పలాస	2573
టెక్కలి	2649
పాతపట్నం	2380
శ్రీకాకుళం	2724
ఆమదాలవలస	2255
ఎచ్చెర్ల	3144
నరసన్నపేట	2981
మొత్తం	21481

మోడల్ పోలింగ్ స్టేషన్లు

దివ్యాంగుల్లో ఓటు వేసే విధానంపై మరింత అవగాహన కల్పించేందుకు, వారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు జిల్లాలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల మండలంలో భగీరథపురం పోలింగ్ స్టేషన్, పలాస నియోజకవర్గంలో వజ్రపు కొత్తూరు మండలంలోని పల్లె సారథి పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. ఆయా కేంద్రాల పరిధిలో ఇక్కడ ఎక్కువ మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ర్యాంపులు, తాగునీరు, వైద్య సదుపాయంతోపాటు, ప్రత్యేక మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక సదుపాయాలు ఇలా..

- పోలింగ్ బూత్ వరకు దివ్యాంగులను తీసుకొచ్చి, వారు ఓటు వేసిన తర్వాత తిరిగి వాహనంలో ఇంటికి చేర్చుతారు. ఈ రవాణా సదుపాయం ఉచితమే.
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ట్రైసైకిల్ అందుబాటులో ఉంటుంది. మూగ, చెవిటి ఓటర్లకు సైన్ లాంగ్వేజీ ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పిస్తారు.
- పోలింగ్ కేంద్రాల్లోకి సులువుగా రాకపోకలు జరిపేందుకు ర్యాంపులు నిర్మించారు.
- అంధులకు సహాయంగా పోలింగ్ కేంద్రంలోకి ఒకరిని అనుమతిస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాలకు అతి సమీపంలో వాహనాల పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒకరు చొప్పున ఎన్.సి.సి/ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. గడిచిన ఎన్నికల్లో 70 శాతం మంది దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి నూరు శాతం సాధించాలన్నదే లక్ష్యం.

– కె.కవిత, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల శాఖ